సాక్షి జోగులాంబ గద్వాల

సోమవారం, 1, మే, 2023



అడ్డా లేక అవస్థలు..

జడ్చర్లలో భవన నిర్మాణ కార్మికులకు అడ్డా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వివరాలు 8లో ▸



ఆదిమ జాతులను ఆదరించాలి

అంతరిస్తున్న ఆదిమ జాతులను ఆదరించాలని ప్రజా యుద్ధనౌక గద్దర్ అభిప్రాయపడ్డారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం

34.1 /24.2

వాతావరణం

గాలిలో తేమ శాతం అధికంగా ఉండడంతో చల్లగా ఉంటుంది. రోజంతా ఆకాశం మేఘావృతమై వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బీచుపల్లిలో జిల్లా అదనపు జడ్జి



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని ఆదివారం జిల్లా అదనపు సీనియర్ సివిల్‌కోర్టు న్యాయమూర్తి ప్రభాకర్ దంపతులు దర్శించుకొని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వారిని శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆలయ విశిష్టతను వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్: డిస్ట్రిక్ట్ హబ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ విభాగంలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళ, శిశు సంక్షేమశాఖ అధికారి ముషాహిదాబేగం ఒక ప్రకటనలో కోరారు. జిల్లా మిషన్ కో–ఆర్డినేటర్ (మహిళలు మాత్రమే), ఫైనాన్సియల్ లిటరసీలో స్పెషలిస్ట్ (స్త్రీ/పురుషులు), అకౌంట్స్ అసిస్టెంట్ (స్త్రీ/పురుషులు) పోస్టులకు ఆయా కోర్సుల్లో డిగ్రీ, పీజీ పూర్తిచేసి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో మూడేళ్లపాటు పనిచేసిన వారు, మల్టీపర్పస్ స్టాఫ్ (స్త్రీ/పురుషులు) పదోతరగతి ఉత్తీర్ణులై 01.07.2022 నాటికి 25 ఏళ్లు మించని జిల్లా స్థానిక అభ్యర్థులు మాత్రమే అర్హులని, ఈ నెల 8వ తేదీలోగా విద్యార్హత, అనుభవం ధ్రువీకరణ పత్రాలతో జిల్లాకేంద్రంలోని సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రామన్‌పాడులో నిలకడగా నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,019 అడుగుల వద్ద నిలకడగా ఉంది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. దీంతో రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వకు నీటి విడుదల నిలిపివేసి.. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వదులుతున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

విద్యావ్యాప్తికి కృషి: ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరు రెడ్డి సేవా సమితి విద్యావ్యాప్తికి కృషి చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక రాజాబహద్దూర్ రెడ్డి కన్వెన్షన్ హాలులో పాలమూరు రెడ్డి సేవాసమితి 21 వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో కొత్వాల్ రాజాబహద్దూర్ వెంకట్రామారెడ్డి దశాబ్దాల క్రితమే వసతి గృహాలు స్థాపించి ఎందరో విద్యార్థులు విద్యను అభ్యసించడానికి దోహదపడ్డారని కొనియాడారు. అదే విధంగా ఇక్కడ పేద విద్యార్థులకు రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో వసతి కల్పించి ఉన్నత విద్యను అందించడాన్ని అభినందించారు. సహజంగా రెడ్లు సేవాభావం కలిగి ఉంటారన్నారు. తమ విద్యాసంస్థల్లో ఎంతో మంది పేదలకు ఉపాధి కల్పిస్తున్నామన్నారు. అంతకు ముందు సేవా సమితి ప్రత్యేక సంచికను ఆయన ఆవిష్కరించారు. అనంతరం శిరీశ, సుమతి, హిమజ ఆలపించిన అన్నమాచార్య కీర్తనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో స్టేట్ ఫిలిం చాంబర్ అధ్యక్షుడు కె.బసిరెడ్డి, పాలమూరు రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి, నాయకులు పోతుల రాఘవరెడ్డి, వి.మనోహర్‌రెడ్డి, బుర్రి వెంకట్రామారెడ్డి, మద్ది అనంతరెడ్డి, వేపూర్ రాజేందర్‌రెడ్డి, వనుల ధనుంజయ్‌రెడ్డి, మల్లు నర్సింహారెడ్డి, దొడ్ల నారాయణరెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

గోశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ఖిల్లాఘనపురం: మండలంలోని గట్టుకాడిపల్లి లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉన్న గోశాల అభివృద్ధికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదివారం రూ.లక్ష విరాళం అందజేశారు. హైదరాబాద్ నూతన సచివాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టిన అనంతరం గోశాల అభివృద్ధికి అందించే విరాళం చెక్కుపై మొదటి సంతకం చేసి అక్కడే ఉన్న ఖిల్లాఘనపురం మండలం షాపురం గ్రామానికి చెందిన నీటిపారుదల శాఖ డీఈ సత్యనారాయణకు అందజేశారు.

మీరే కథానాయకులు..



పాదయాత్రగా వస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

పాలమూరులో 14 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను గెలిపించాలి

- ఓటును అమ్ముకుంటే ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నట్లే
- నన్ను మీరే ముందుకు తీసుకెళ్లాలి: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి
- నిరుద్యోగ నిరసన సభ సక్సెస్‌తో కాంగ్రెస్‌లో జోష్
- ర్యాలీలో కదం తొక్కిన పార్టీ శ్రేణులు, యువత



గడియారం చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌కు హాజరైన కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/స్టేషన్ మహబూబ్‌నగర్: 'కాంగ్రెస్‌లో ఎందరో సీనియర్లు ఉన్నా.. టీపీసీసీ అధ్యక్షుడిగా సోనియాగాంధీ అవకాశం ఇచ్చారు.. ప్రతి పాలమూరు బిడ్డ టీపీసీసీ అధ్యక్షుడే.. ఈ కథలో మీరే కథానాయకులు.. నన్ను మీరే ముందుకు తీసుకెళ్లాలి' అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరుద్యోగ నిరసన ర్యాలీ నిర్వహించారు. మెట్టుగడ్డ నుంచి క్లాక్‌టవర్ వరకు సాగిన ర్యాలీ అనంతరం నిర్వహించిన సభలో నిరుద్యోగులు, యువ తను ఉద్దేశించి రేవంత్ మాట్లాడారు. పాలమూరు బిడ్డలు కష్టజీవులు.. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నిర్మాణంలో పాలమూరు బిడ్డల కష్టం ఉందన్నారు. కృష్ణా, తుంగభద్ర నీళ్లతో తడిసిన నేల పాలమూరు అని పేర్కొన్నారు. హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, సురవరం ప్రతాపరెడ్డి, కొత్వాల్ రాజాబహదూర్ వెంకట్రామారెడ్డి, సూదిని జైపాల్‌రెడ్డి, మహేంద్రనాథ్ మన పాలమూరు బిడ్డలే అని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో మహామహులు ఉన్నా నల్లమల బిడ్డకు రాష్ట్రంలో పార్టీని నడిపించే అవకాశం వచ్చిందన్నారు. జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, వెంకటరెడ్డి వంటి వారికి బీఫాం ఇచ్చే అవకాశం మీ బిడ్డకు వచ్చిందని.. ఇది పాలమూరు జిల్లాకు గర్వకారణమన్నారు. మీ బిడ్డను ఆదరించాలని.. జిల్లాలో 14కు 14 అసెంబ్లీ స్థానాలను, 2 పార్లమెంట్ స్థానాలను గెలిపించాలని కోరారు. ఓటును అమ్ముకుంటే ఆత్మగౌరవాన్ని అమ్ముకున్నట్లేనని.. మీరు ఆదరించిన మీ బిడ్డను నంపుకుంటారో.. సాదుకుంటారో.. మీ ఇష్టం.' అని అన్నారు. మీరు ఆదరించుకుంటే పాలమూరుకు మరో 50 ఏళ్ల వరకు అవకాశాలు రావని .. అన్ని స్థానాల్లో గెలిపిస్తే నాకీ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞత తెలుపుకున్న వాళ్లమవుతామని రేవంత్‌రెడ్డి ఉద్వేగంగా మాట్లాడారు.



➡ మాజీ ఎంపీ మల్లురవి మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో గతంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నిరుద్యోగ జంగ్ సైరన్ నిర్వహించినట్లు గుర్తు చేశారు. 30 లక్షల మంది నిరుద్యోగుల కోసం రేవంత్‌రెడ్డి పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు.

➡ మాజీ మంత్రి చిన్నారెడ్డి మాట్లాడుతూ యువకుల ప్రాణత్యాగం వల్ల తెలంగాణ వచ్చిందన్నారు. ఇంటికో ఉద్యోగమని సీఎం కేసీఆర్ నిరుద్యోగ యువతను మోసం చేసినట్లు ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, రేవంత్‌రెడ్డి సీఎం అవుతారని రెండు లక్షల ఉద్యోగాల భర్తీ కోసం మొదటి సంతకం పెట్టాలని కోరారు.



ర్యాలీలో తెండాలను ప్రదర్శిస్తున్న యువత

➡ మాజీ పీసీసీ అధ్యక్షులు వి.హనుమంతురావు మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలనే ఆలోచన కేసీఆర్‌కు లేదన్నారు. రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీలు నిరుద్యోగులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. 30వ తేదీన ఒకే రోజు నాలుగు పరీక్షలు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

➡ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగాలు కల్వకుంట్ల కుటుంబానికి వచ్చాయని ఆరోపించారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పార్టీ మూడున్నర లక్షల ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేస్తారో ఈ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయడం లేదన్నారు. యువతకు ఉద్యోగాలు రావాలంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరారు. నిరుద్యోగ జేఏసీ జాన్సన్ బాబు మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసే వరకు తాము పరీక్షలు రాయమన్నారు. వెంటనే నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభలో ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఒబేదుల్లా కొత్వాల్ తదితరులు ప్రసంగించారు. మాజీ ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, ఎర్రశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు వినోద్‌కుమార్, అనిరుధ్‌రెడ్డి, ప్రదీప్‌గౌడ్, సంజీవ్ ముదిరాజ్, ప్రశాంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు శ్రీహరి, డాక్టర్ వంశీకృష్ణ, రాజేంద్రప్రసాద్, నాయకులు అభిలాష్ రావు, బెనహర్, సిరాజ్‌ఖాద్రి పాల్గొన్నారు.

కేసీఆర్ అవినీతిపై ఉద్యమం చేద్దాం: నాగం

కేసీఆర్ అవినీతిపై ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. క్లాక్‌టవర్‌లో డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో నాగం జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ప్రతి ఏడాది ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ప్రజాసమస్యలపై పోరాడుతున్న రేవంత్‌రెడ్డికి అండగా నిలుద్దామని కోరారు.

నాయకులతో కలిసి రేవంత్ పాదయాత్ర

పాలమూరులో ఆదివారం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరుద్యోగ నిరసన ర్యాలీ ఆ పార్టీలో జోష్ నింపింది. ర్యాలీలో పార్టీ శ్రేణులు, యువతకు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మెట్టుగడ్డ చౌరస్తా వద్దకు సాయంత్రం 6.32 నిమిషాలకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేరుకున్నారు. పలువురు పార్టీ నాయకులు ఆయనను శాలువాలతో, క్రేన్ ద్వారా గజమాలతో సన్మానం చేశారు. అనంతరం 6.39 గంటలకు మెట్టుగడ్డ నుంచి రేవంత్‌రెడ్డి నాయకులతో కలిసి పాదయాత్రగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ఆర్టీసీ బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, అశోక్‌టాకీస్ చౌరస్తా మీదుగా 7.20 గంటలకు క్లాక్‌టవర్ వరకు చేరుకున్నారు. పార్టీ శ్రేణులు, యువతతో క్లాక్‌టవర్ ప్రాంతం కిక్కిరిసిపోయింది.

సెల్‌ఫోన్ చోరీలకు చెక్



బాధితులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ సృజన (ఫైల్)

- అందుబాటులోకి సీఈఐఆర్ వెబ్‌సైట్
- అపహరించిన ఫోన్ పనిచేయదు
- సిమ్ వేస్తే దొరికిపోవడమే..
- ఇప్పటికే పలు సెల్‌ఫోన్లు రికవరీ

గద్వాల క్రైం: సెల్‌ఫోన్లలో కీలక సమాచారంతో పాటు వ్యక్తిగత డాటా ఉండటంతో అది అపహరణకు గురైతే బాధితులు తీవ్ర ఆందోళనకు గురవడమేగాక ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లావ్యాప్తంగా 6 లక్షల జనాభా ఉంటే... ఫోన్ల వినియోగం కూడా అదేవిధంగా ఉంది. ప్రస్తుత సమాజంలో విద్యార్థుల నుంచి వృద్ధుల దాకా స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరిగింది. గతంలో ఫోన్ అపహరణకు గురైనా.. పోగొట్టుకున్నా దొరకడం కష్టంగా ఉండేది. ఇటీవల సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) వెబ్‌సైట్ అందుబాటులోకి రావడంతో ఇట్టే దొరికిపోతుంది. ఈ సాంకేతిక విప్లవం ద్వారా కేటీదొడ్డి, అయిజ, ఇటిక్యాల, గద్వాల రూరల్ పోలీసుస్టేషన్ల పరిధిలో 10 మంది సెల్‌ఫోన్లు పోయినట్టుగా ఫిర్యాదులు చేయగా వెబ్‌సైట్ ద్వారా గుర్తించి రికవరీ చేసి ఎస్పీ సృజన వారికి అందజేశారు.

ఆధునిక సాంకేతికతతో..

డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్ సీఈఐఆర్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫోన్ ఐఎంఈఐ నంబర్‌తో బ్లాక్ చేస్తే ఎట్టి పరిస్థితిల్లోనూ పనిచేయదు. అందులో వేరే సిమ్‌కార్డు వేసినా వెంటనే బాధితుడికి ఎస్ఎంఎస్ వస్తుంది. మొబైల్‌లో *#06# డయల్ చేయగానే ఐఎంఈఐ నంబర్ ప్రత్యక్షమవుతుంది. ఒకవేళ ఫోన్ పోగొట్టుకుంటే బాక్స్‌మీద లేదా కొనుగోలు చేసిన బిల్లు మీద ఐఎంఈఐ నంబర్ ఉంటుంది.

త్వరగా ఛేదించవచ్చు..

ఆధునిక సాంకేతికతతో తస్కరించిన స్మార్ట్‌ఫోన్లను త్వరగా ఛేదించవచ్చు. పూర్తి సమాచారం సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారం క్రితం 10 మంది ఫోన్లను ఈ యాప్ ద్వారా గుర్తించాం. చోరీలకు చెక్ పెట్టవచ్చు. – సృజన, జిల్లా పోలీసు అధికారి

కేవైఎంతో..

సెకండ్‌హ్యాండ్ సెల్‌ఫోన్ కొనుగోలు చేయాల్సి వచ్చినప్పుడు అది దొంగిలించిందా? బ్లాక్ లిస్టులో ఉందా? అన్న విషయం కేవైఎం(నో యువర్ మొబైల్) విధానంలో ముందే తెలుసుకోవచ్చు. మొబైల్‌లో కేవైఎం అని పెద్ద అక్షరాల్లో టైప్‌చేసి 15 అక్షరాల ఐఎంఈఐ నంబర్‌ను నమోదుచేసి 14422కు ఎస్ఎంఎస్ చేయాలి. లేదంటే ఆండ్రాయిడ్/ఐఓఎస్ మొబైల్ ప్లేస్టోర్‌లలో కేవైఎం యాప్ అందుబాటులో ఉంది. లేక సీఈఐఆర్ వెబ్‌పోర్టల్‌లో ఆఖరుగా ఇచ్చిన ఆప్షన్ ద్వారా కూడా సెల్‌ఫోన్ తనిఖీ చేయవచ్చు.

సెల్‌ఫోన్ పోయిన వెంటనే..

http://www.ceir.gov.in పోర్టల్ ఓపెన్ చేయాలి. అందులో బ్లాక్ ఫోన్ అనే ఆప్షన్ ఎంచుకోవాలి. మొబైల్ నంబర్–1, మొబైల్ నంబర్–2 సెల్‌ఫోన్ బ్రాండ్, మోడల్, ఇన్‌వాయిస్ (బిల్) ఫొటో సూచించిన గడుల్లో నింపాలి. పోగొట్టుకున్న స్థలం, పోయిన తేదీ, చిరునామా, పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు నంబర్, ఫోన్ కొనుగోలు చేసిన వ్యక్తి చిరునామా, ఈ–మెయిల్ ఐడీ, ధ్రువీకరణ కార్డులు సూచించిన బాక్స్‌ల్లో నింపాక ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేసిన తర్వాత ఫారంను సబ్‌మిట్ చేయగానే పోగొట్టుకున్న ఫోన్ బ్లాక్ అవుతుంది. ఇక దానిని ఎవరూ ఆపరేట్ చేయలేరు.. దానిలోని డాటా సురక్షితంగా ఉంటుంది. దొంగిలించిన వ్యక్తి సిమ్ వేయగానే మీ నంబర్‌కు మెస్సేజ్ వస్తుంది. ఆ సందేశం ఆధారంగా ఫోన్ ఎక్కడ ఉన్నా పట్టుకోవడం సులభమవుతుంది.

'హరిత' సోయగం



అమరచింత మండలం నందిమళ్లలో నదీ తీరం వెంట ప్రభుత్వ భూములను గుర్తిస్తున్న అధికారులు (ఫైల్)

- కృష్ణా తీరం వెంట 'వృక్షమాల' అమలుకు ప్రభుత్వం శ్రీకారం
- నది తీర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల గుర్తింపు
- రెవెన్యూ, ఇరిగేషన్, ఉపాధి అధికారుల సమన్వయంతోనే..

అమరచింత: హరితహారం తరహాలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రవహిస్తున్న కృష్ణా తీరం వెంట మొక్కల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం 'వృక్షమాల' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నదీతీరం వెంట ఉన్న ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటి సంరక్షించేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఉపాధిహామీ పథకంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టనుంది. మక్తల్ నియోజకవర్గం తంగిడి శివారులో కృష్ణానది ప్రవేశిస్తుంది. నారాయణపేట, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల మీదుగా శ్రీశైలం జలాశయానికి చేరుతుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 295 కిలోమీటర్ల మేర ప్రవహిస్తూ ఉమ్మడి జిల్లా సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తోంది. వరదల సమయంలో తీరం కోతకు గురికాకుండా, పరీవాహక ప్రాంతాల్లో పచ్చదనాన్ని అభివృద్ధి చేసేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుందని అధికారులు చెబుతున్నారు. జూరాల, రామన్‌పాడు జలాశయాలు, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి వంటి ఎత్తిపోతల పథకాలు కృష్ణానది జలాలపై ఆధారపడి కొనసాగుతున్నాయి.

నాటే మొక్కలు..

వృక్షమాల కార్యక్రమంలో ఎరుమది, వేప, రాగి, నేరేడు, నల్ల తుమ్మ, నీలగిరి, ఇప్ప, చింత తదితర మొక్కలను స్థానికంగా ఉన్న నర్సరీల నుంచి సమకూర్చనున్నారు. సంరక్షకులను నియమించి రెండేళ్ల పాటు వారికి ఉపాధి నిధుల నుంచి వేతనాలు చెల్లించేలా ఆదేశాలు జారీ చేశారు.

ఆగస్టు 15 వరకు..

నదీతీర ప్రాంతాల్లో మార్చి ఒకటి నుంచి ఆగస్టు 15 వరకు మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేయనున్నారు. ఈ మేరకు నది పరీవాహక ప్రాంతాల్లో ఉపాధి సిబ్బంది పర్యటించి మొక్కలు నాటేందుకు అనువైన ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తున్నారు. స్థలాల ఎంపిక అనంతరం గ్రామసభలు నిర్వహించి మొక్కలు నాటేందుకు తీర్మానం చేస్తారు. ఎకర స్థలంలో వెయ్యి మొక్కల చొప్పున మొక్కలు నాటేందుకు ప్రణాళికలకు సిద్ధం చేస్తున్నారు. జూన్ నాటికి గుంతలు తవ్వడం పూర్తి చేయనున్నట్లు ఉపాధి హామీ అధికారుల చెబుతున్నారు.

నదీతీర గ్రామాల్లో సర్వే..



కృష్ణానది తీర ప్రాంతాల్లో వృక్షమాల కార్యక్రమం అమలు చేసేందుకు రెవెన్యూ సిబ్బందితో పాటు స్థానికుల సహకారం తీసుకుంటున్నాం. నదీ తీరం వెంట అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్నాం. పరీవాహక ప్రాంత రైతులనే వన సంరక్షకులుగా నియమించేలా చర్యలు తీసుకుంటున్నాం. మొక్కల లభ్యతపై నర్సరీల నిర్వాహకుల నుంచి వివరాలు సేకరిస్తున్నాం.

– వెంకటేశ్వర్‌రెడ్డి, ప్లాంటేషన్ సూపర్‌వైజర్

కృష్ణాతీరం వెంట వృక్షమాల కార్యక్రమం పకడ్బందీగా అమలు చేయనున్నారు. అమరచింత మండలంలోని చింతరెడ్డిపల్లి, మిట్టనందిమళ్ల, ఈర్లదిన్నె, కిష్టంపల్లి, నందిమళ్ల గ్రామాల మీదుగా కృష్ణానది పది కిలోమీటర్ల మేర ప్రవహిస్తోంది. ఆయా గ్రామాల్లో నాలుగు కిలోమీటర్ల పొడవునా 1,600 మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వడంతో పాటు 4,500 మొక్కలు నాటాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

- ఆత్మకూర్ మండలం మూలమళ్ల, జూరాల, గుంటిపల్లి, మొట్లంపల్లి, ఆరేపల్లి, కత్తేపల్లి, తూంపల్లి, రేచింతలలో 24 కిలోమీటర్ల నదీతీరం వెంట 8 కిలోమీటర్ల పరిధిలో 3,200 మొక్కలు నాటనున్నారు.
- చిన్నంబావి మండలంలోని అయ్యవారిపల్లి, చెల్లపాడు, కొల్లూరు, చిన్నమారూర్, పెద్దమారూర్, వెల్టూర్, గూడెం, బెక్కెం, కొప్పునూర్, గద్దబుస్వాపురంలో 38 కిలోమీటర్ల కృష్ణాతీరం ఉండగా.. 3.5 కిలోమీటర్లలో 1,400 మొక్కలు నాటనున్నారు.
- పెబ్బేర్ మండలం రంగాపురం, జనంపల్లి, పెంచికలపాడు, ఈర్లదిన్నె, బూడిదపాడు, తిప్పాయిపల్లి, గుమ్మడం, గుమ్మడంతండా, యాపర్లలోని 13.5 కిలోమీటర్ల పొడవున ఉన్న నదీతీరం వెంట ఎనిమిది కిలోమీటర్ల మేర 3,200 మొక్కలు నాటేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

పార్టీ పటిష్టతకు సమష్టి కృషి

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

మల్దకల్: పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని దళితవాడలో పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొదట ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని విన్నారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామాల్లో ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు, గోవిందు, వెంకటేష్, కిషోర్, రాముడు, లక్ష్మన్న, నర్సింహులు, తిమ్మప్ప, నవారమ్మ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులతో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

నేడు 'పాలమూరు–రంగారెడ్డి'పై సీఎం సమీక్ష

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలతో పాటు నల్లగొండను సస్యశ్యామలం చేసే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం సమీక్షించనున్నారు. బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని సీఎం సమావేశ మందిరంలో మధ్యాహ్నం 12 గంటలకు సమావేశం జరగనుంది. ఇందులో ప్రధానంగా కరివెన, ఉదండాపూర్ రిజర్వాయర్ల నుంచి నారాయణపేట, కొడంగల్, వికారాబాద్‌కు వెళ్లే తాగునీటి కాల్వల గురించి సమగ్రంగా చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. సమీక్షలో ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, సీఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్, ఇరిగేషన్ శాఖ కార్యదర్శి రజత్ కుమార్, ఆర్థికశాఖ కార్యదర్శి, ఇరిగేషన్ ఈఎన్సీ, చీఫ్ ఇంజినీర్లు పాల్గొననున్నట్లు సమాచారం.

కానిస్టేబుల్ తుది పరీక్ష ప్రశాంతం

- 98.9 శాతం హాజరు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్




పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల కోలాహలం

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలో నిర్వహించిన కానిస్టేబుల్ తుది రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష కొనసాగింది. ఆ తర్వాత ప్రశ్నాపత్రాలను పోలీసులు హైదరాబాద్ తరలించారు. జిల్లా కేంద్రంలో 30, భూత్పూర్‌లో ఒక పరీక్ష కేంద్రంలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 8గంటల నుంచి అభ్యర్థులు ఆయా కేంద్రాల దగ్గరకు చేరుకున్నారు. 9గంటల నుంచి అభ్యర్థులను లోపలికి పంపించారు. కేంద్రాల్లో అభ్యర్థులకు బయోమెట్రిక్ విధానంలో భాగంగా ఫింగర్ ప్రింట్, ఫొటో స్కానింగ్ చేశారు. అన్ని కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో వెళ్లారు. ప్రతి కేంద్రం దగ్గర సీఐతో పాటు ఎస్ఐ ఇతర పోలీస్ సిబ్బంది బందోబస్తు చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కానిస్టేబుల్ పరీక్ష రాయాల్సిన అభ్యర్థులు 14,384 మంది కాగా 146మంది గైర్హాజరయ్యారు. పరీక్షకు 98.98శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష పూర్తయిన తర్వాత ప్రశ్నాపత్రాలను పోలీస్ బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూంకు తరలించి, అక్కడి నుంచి సాయంత్రం హైదరాబాద్ జీఎస్‌టీయూకు పంపించారు. పరీక్ష కేంద్రాలను ఇన్‌చార్జ్ ఎస్పీ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ, నోడల్ ఆఫీసర్ రాములు, పరీక్ష రీజనల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ సుజీవ్‌కుమార్, డీఎస్పీ మహేష్, ఇతర పోలీస్ అధికారులు పర్యవేక్షించారు.

➪ అత్యధికంగా జేపీఎన్‌సీఈ కళాశాలలో 978మంది అభ్యర్థులు పరీక్ష రాయగా, అత్యల్పంగా మెట్టుగడ్డ ఓ పాఠశాలలో 232మంది పరీక్షకు హాజరయ్యారు. అత్యధికంగా ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో పది మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

మానవత్వం చాటిన కానిస్టేబుల్

పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష రాయడానికి వచ్చిన మహిళా అభ్యర్థి ఫొటో ఐడీ ప్రూఫ్ మరిచిపోయింది. పరీక్షకు కేవలం 10నిమిషాల సమయం ఉండటంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ రమేష్ ఆమెను ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి కొత్త ఐడీప్రూఫ్ తీసుకుని, మళ్లీ కేంద్రం వద్ద చివరి నిమిషంలో వదిలిపెట్టాడు. కానిస్టేబుల్‌ను ఎస్పీ నరసింహ అభినందించారు.

డీఐజీ పరిశీలన



అభ్యర్థితో మాట్లాడుతున్న డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్

జిల్లా కేంద్రంలో జేపీఎన్‌సీఈ, ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాలను జోగుళాంబ గద్వాల జోన్–7 డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్ పరిశీలించారు. అభ్యర్థులతో మాట్లాడటంతో పాటు పరీక్ష ఆవరణలో ఏర్పాట్లు చూశారు. అనంతరం ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల వద్ద విలేకరులతో మాట్లాడారు. మొత్తం 31 పరీక్షా కేంద్రాలను ఐదు రూట్‌లుగా విభజించి ప్రతి రూట్‌లలో సీఐలు పర్యవేక్షించడంతో పాటు పోలీస్ సిబ్బందిని అవసరం మేరకు ఏర్పాటు చేశామన్నారు. కేంద్రంలోకి వెళ్లే ప్రతి వెళ్లే అభ్యర్థిని తనిఖీ చేశామని, కేంద్రం పరిసరాలలో 144 సెక్షన్ అమలు చేశామన్నారు. చిన్నపొరపాటు లేకుండా పూర్తి భద్రత చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.



హాల్‌టికెట్ నంబర్లు చెక్ చేసుకుంటున్న అభ్యర్థులు



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న మహిళా అభ్యర్థులు



హాల్‌టికెట్లు పరిశీలిస్తున్న పరీక్ష కేంద్రం సిబ్బంది

క్లుప్తంగా

యువకుడి అదృశ్యం: కేసు నమోదు



శ్రీను

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని వెల్టూర్‌కు చెందిన ఖానాపురం శ్రీను రెండు రోజులుగా కనబడటం లేదని తల్లి మన్నెమ్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శ్రీనుకు 8నెలల క్రితం వివాహం కాగా, కొంత కాలంగా భార్యతో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ ప్లంబర్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా హైదరాబాద్ నుంచి గత నెల 28న గ్రామానికి వచ్చాడు. అదే రోజు ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఇంటికి రాలేదని తల్లి ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

దొంగ అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు



మహబూబ్‌నగర్ క్రైం: మహిళకు మాయ మాటలు చెప్పి.. ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడు దొంగతనం చేసిన వ్యక్తిని మూడు రోజుల వ్యవధిలో వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆదివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ బాలకృష్ణగౌడ్ వెల్లడించారు. గత నెల 26న ఎదిరకు చెందిన శాంతమ్మ జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ ఏరియాలో కిరాణ సామగ్రి కొనుగోలు చేయడానికి వచ్చింది. అయితే ఆమెతో గుర్తు తెలియని వ్యక్తి మాటలు కలిపి ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తె, బంగారు పత్తిలు, బంగారు గుండ్లు అపహరించుకుని వెళ్లాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి మూడు రోజుల వ్యవధిలో నిందితుడు మిడ్జిల్ మండలం వెలుగొమ్ములకు చెందిన కావలి లక్ష్మయ్యను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి బంగారు పుస్తె, బంగారు పత్తిలు, బంగారు గుండ్లతోపాటు గతంలో జడ్చర్ల, నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చేసిన చోరీలకు సంబంధించిన బంగారు వస్తువులు సైతం రికవరీ చేసినట్లు తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.90 వేలు ఉంటుందని ఎస్ఐ చెప్పారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో కానిస్టేబుళ్లు పవన్‌కుమార్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీవ్రంగా కొట్టి.. తాడుతో స్తంభానికి కట్టేసి.. దెబ్బలకు తాళలేక వ్యక్తి మృతి



వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ శ్రీనివాస్

లింగాల: బెదిరించి వదిలేదం అనుకున్న ఆ వ్యక్తులు చివరికి వారు కొట్టిన దెబ్బలకు తాళలేక ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం మండలంలోని శాయిన్‌పేటలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని శాయిన్‌పేటకు చెందిన సబావట్ భీముడు(40) కూలీ పనులు చేసుకుంటూ జీవించేవాడు. తాగుడుకు బానిసైన అతను తరుచుగా చుట్టుపక్కల వారిని దూషించడం, సైకోగా ప్రవర్తించడం చేసేవాడు. దీంతో భీముడు భార్య ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెతో కలిసి గత కొన్ని నెలల నుంచి తల్లిగారి గ్రామమైన రాయవరంలో ఉంటుండగా భీముడు ఒంటరిగా జీవిస్తున్నాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి భీముడు ఇంటి వెనకాల ఉన్న నిమ్మల నర్సింహతో గొడవపడ్డారు. దీంతో క్షణికావేశానికి గురైన నర్సింహ మరికొందరు కలిసి చితకబాదారు. ఆ తర్వాత పక్కనున్న విద్యుత్ స్తంభానికి తాడుతో కట్టేశారు. దాహం వేస్తుందని చెప్పగా మూత్రం తాగించినట్లు తెలిసింది. కొన్ని గంటల పాటు విద్యుత్ స్తంభానికి కట్టి ఉన్న అతడిని తెల్లవారు జామున ఇరుగు పొరుగు వారు తాళ్లను విప్పగా అప్పటికే మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీనివాస్ గ్రామానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఈ ఘటనపై భీముడు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కొత్త సచివాలయంలో బాధ్యతల స్వీకరణ..




హైదరాబాద్‌లోని నూతన సచివాలయంలో ఆదివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తమ చాంబర్లలో ప్రత్యేక పూజలు చేసి బాధ్యతలు స్వీకరించారు. వీరికి ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పుష్ప గుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఆదిమ జాతులను ఆదరించాలి

అమ్రాబాద్‌లో ప్రజా యుద్ధనౌక గద్దర్

అమ్రాబాద్: పాలమూరు చుట్టూ నీరున్నా.. సాగునీరు పూర్తిస్థాయిలో అందడం లేదని ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్నారు. ఆదివారం అమ్రాబాద్లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాల ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్లమలలో ఉన్న వెదురు వినియోగంతో పేపర్ పరిశ్రమ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బహుళ జాతి కంపెనీల కన్ను మళ్లీ నల్లమలపైనే పడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని, పచ్చని అడవులు, నదీ జలాలు నాశనం కాకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అంతరించిపోతున్న ఆదిమ జాతులను ఆదరించాలని, చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. మహిళలు, పురుషులు తేడా లేకుండా సమాన హక్కులు ఉండాలన్నారు. సర్వ మతాలకు సమాన ఆదరణ ఉండాలన్న లక్ష్యంతో భిన్నత్వంలో ఏకత్వంగా ఉండాలని రాజ్యాంగంలో పొందుపరిచారని వివరించారు. రాజ్యాధికారం కోసం ఓటు అనే వజ్రాయుధాన్ని అమ్ముకోకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చదువుతోనే అన్నీ సాధ్యమవుతాయని, ఇతరులకు సాయాన్ని అందించే శక్తి విద్యకు ఉందన్నారు. మహనీయులు జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే, అంబేడ్కర్ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. తనదైన శైలిలో ఆటపాటలతో సభికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం మండలాధ్యక్షుడు ఎల్లస్వామి, నాయకులు కాశన్నయాదవ్, ఎంఎం గౌడ్, నానరయ్య, బాలకిష్టయ్య, బలసాయిలు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజా యుద్ధనౌక గద్దర్

పచ్చని కుటుంబంలో మద్యం చిచ్చు

- నిత్యం తాగి వేధిస్తున్న భర్తను నరికి చంపిన భార్య
- పిల్లలు చూస్తుండగానే దారుణానికి ఒడిగట్టిన వైనం
- జోగుళాంబ జిల్లా మొగిలిరావులచెర్వులో ఘటన



దేవదాసు (ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: ఒకరినొకరు ప్రేమించుకున్నారు.. కులాలు వేరైనా కలిసి జీవించాలనుకున్నారు. ఈ క్రమంలో పెద్దలను ఎదురించి వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం సైతం కలిగారు. అలా సాఫీగా సాగిపోతున్న వీరి సంసారంలో మద్యం చిచ్చురేపింది. తాగుడుకు బానిసైన భార్యాభర్తలు ఇద్దరూ మద్యం మత్తులో తరుచుగా గొడవపడేవారు. దీంతో విసిగివేసారిన భార్య క్షణికావేశానికి లోనై.. పిల్లలు వద్దని వారిస్తున్నా.. నిద్రిస్తున్న భర్తను గొడ్డలితో నరికి చంపేసింది. ఈ విషాదకర సంఘటన ఇటిక్యాల మండలంలోని మొగిలిరావులచెర్వులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఇటిక్యాల ఏఎస్ఐ అయ్యన్న, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దేవరాజు అలియాస్ దేవదాసు(35) వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం చెల్లెపాడుకు చెందిన అలివేలును 15 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరు మద్యం మత్తులో తరుచూ గొడవపడేవారు. ఈ క్రమంలో శనివారం రాత్రి దేవదాసు మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. దీంతో అర్ధరాత్రి పడుకున్న భర్తను పిల్లలు చూస్తుండగానే గొడ్డలితో విచక్షణారహితంగా నరకడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. దేవదాసుకు భార్య అలివేలుతోపాటు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై దేవదాసు సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. సంఘటనా స్థలాన్ని అలంపూర్ సీఐ సూర్యనాయక్ సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

జడ్చర్లలో కాంగ్రెస్ కుమ్ములాట

- రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికే క్రమంలో ఇరువర్గాల తోపులాట
- రహదారిపై పూలకుండీలు ధ్వంసం



ఇరువర్గాల తోపులాటలో ధ్వంసమైన పూలకుండీలు

జడ్చర్ల: జడ్చర్లలో కాంగ్రెస్ కుమ్ములాటలు మరోసారి బయటపడ్డాయి. ఇప్పటికే టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి మధ్య ఉన్న విభేదాలు మరింత బహిర్గతమయ్యాయి. ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా జడ్చర్ల క్రాస్ రోడ్ వద్ద ఆయనకు స్వాగతం పలికేందుకు ఇరువురు నాయకులు తమ అనుచరులతో ఎవరికి వారు విడివిడిగా స్వాగత ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. బ్రిడ్జి కింద మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ తన అనుచరులతో ఎదురుచూస్తుండగా.. పెట్రోల్ బంక్ సమీపంలో అనిరుధ్‌రెడ్డి తన అనుచరులతో జేసీబీ సహాయంతో రేవంత్‌రెడ్డికి గజమాల వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ క్రమంలో ఎర్ర శేఖర్ అనుచరులు జేసీబీ దగ్గరకు వెళ్లి డ్రైవర్ వద్ద తాళం చెవి లాక్కోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఒకరినొకరు దూషించుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. కాగా ఇప్పటికే ఇద్దరు నాయకులతో ఇబ్బందులు పడుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ చోద్యం చూసి విస్తుపోయారు. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే ఎన్నికల్లో పోటీ కోసం ఏకాభిప్రాయం ఎలా కుదురుతుందని అనుమానం వ్యక్తం చేశారు.

రేవంత్ పర్యటనలో దొంగల చేతివాటం

జడ్చర్ల: జడ్చర్ల బస్టాండ్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద రేవంత్‌కు స్వాగతం పలికేందుకు పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సందడి చేస్తున్న సమయంలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు నిరుద్యోగ మార్చ్‌లో పాల్గొనేందుకు వస్తున్న సందర్భంగా జడ్చర్ల క్రాస్ రోడ్ వద్ద భారీగా జన సమూహం ఏర్పడింది. ఈ సమయంలో దొంగలు తమ ప్రతాపం ప్రదర్శించారు. మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన మహిళా సంఘాల బుక్ కీపర్ సరస్వతి తమ సమస్యల పరిష్కారం కోరుతూ రేవంత్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చింది. వినతి పత్రం సమర్పించే సమయంలో జరిగిన కార్యకర్తల తోపులాటలో దొంగలు ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడును తెంపుకుపోయారు. దీంతో ఆమె ఒక్కసారిగా లబోదిబోమంది. అదేవిధంగా మిడ్జిల్ మాజీ ఎంపీటీసీ సభ్యులు సంపత్‌కుమార్ జేబులో ఉన్న రూ.25వేల నగదును అపహరించారు. ఇద్దరు ముగ్గురి మొబైల్ ఫోన్లతో పాటు నగదును అపహరించారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సరస్వతి పుస్తెలతాడు చోరీపై కేసు నమోదు చేశామని సీఐ రమేశ్‌బాబు తెలిపారు.

అడ్డా లేక అవస్థలు..

బాదేపల్లిలో రోడ్డు పక్కన కార్మికుల పడిగాపులు

- భీమయ్య హోటల్ వద్దే పని కోసం ఎదురుచూపులు
- అడ్డా మార్చి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్
- నిత్యం 350 నుంచి 500 మంది రాక
- కార్మిక దినోత్సవం సందర్భంగా కథనం



భీమయ్య హోటల్ వద్ద నిలబడి పని కోసం వేచి ఉన్న దినసరి కూలీలు (కార్మికులు)

జడ్చర్ల టౌన్: వారంతా భవన నిర్మాణరంగంలో కార్మికులుగా పనిచేసే దినసరి కూలీలు. అయినప్పటికీ వారికి ఒక అడ్డా లేకపోవటం ఇబ్బందిగా మారింది. మున్సిపాలిటీ పరిధిలోని గంజ్ సమీపంలో భీమయ్య హోటల్ ప్రాంతంలో ప్రస్తుతం పనుల కోసం వేచి ఉంటున్నారు. మొదట రంగారావుతోట శంకర్‌బాబు ఇంటి సమీపంలో కార్మికులు పనులకోసం వేచి చూసేవారు. రానురాను కార్మికుల సంఖ్య పెరగటం, వివిధ ప్రాంతాల నుంచి కార్మికులు వచ్చి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండటంతో భీమయ్య హోటల్ వద్దకు అడ్డా మార్చారు. మండలంలోని పలు గ్రామాలతోపాటు సమీపంలోని తిమ్మాజీపేట మండలం నుంచి నిత్యం 350 మంది నుంచి 500మంది వరకు పనుల కోసం అడ్డా వద్దకు వచ్చి వేచి ఉంటున్నారు. ఉదయం 8.30గంటల నుంచి 11గంటల వరకు అక్కడే రోడ్డు పక్కన వేచి ఉంటారు. కాంట్రాక్టర్లు, మేస్త్రీలు వచ్చి తమకు కావాల్సినంత మంది కూలీలను పనులకు తీసుకువెళ్తుంటారు. అయితే అడ్డాలో కనీస సౌకర్యాలు లేకపోవటంతో ఇబ్బందిపడుతున్నారు. కూర్చోడానికి కుర్చీలు, తాగునీరు, మూత్రశాలలు, వర్షం, ఎండకు నిలబడేందుకు కాస్త చోటు కావాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గిరిజన మహిళ మృతి

ప్రస్తుతం కార్మికుల అడ్డా భీమయ్య హోటల్ జడ్చర్ల–నాగర్‌కర్నూల ప్రధాన రోడ్డుపై ఉండటంతో కార్మికులకు రోడ్డు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. రెండేళ్ల క్రితం పని కోసం వచ్చిన తిమ్మాజీపేట మండలం మరికల్ తండాకు చెందిన ఓ గిరిజన మహిళ రోడ్డు దాటుతూ ప్రమాదానికి గురై మృతి చెందింది. నాటి నుంచి నేటివరకు ఎంతోమంది కార్మికులు క్షతగాత్రులయ్యారు. అందుకే కార్మికుల అడ్డా మార్చటంతోపాటు అన్ని సౌకర్యాలు ఉన్న ప్రాంతానికి మార్చాలన్న డిమాండ్ పెరుగుతోంది.

ప్రజావాణిలో దరఖాస్తులు

అడ్డా కార్మికుల సమస్యలపై బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో వినతిపత్రం సమర్పించారు. అలాగే అడ్డా కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలోనూ ప్రజావాణిలో కలెక్టర్‌కు అడ్డా మార్పు, కనీస సౌకర్యాల గురించి వినతిపత్రం సమర్పించారు. కార్మికుల ప్రయోజనం కోసం బీమా కల్పించాలని లేబర్ అధికారులకు సమస్యలు విన్నవించారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



మేం పనికోసం రోజు మరికల్ నుంచి వచ్చి వేచి చూడాల్సి వస్తుంది. మేస్త్రీలు వచ్చి పనికోసం తీసుకెళ్లే వరకు రోడ్డుపైనే నిలబడి ఉంటున్నం. ఎండలకు చాలా కష్టంగా ఉంది. రెండేళ్ల క్రితం మరికల్ తండాకు చెందిన గిరిజన మహిళ పనికోసం వచ్చి రోడ్డు దాటుతూ వాహనం ఢీకొని చనిపోయింది. అప్పటి నుంచి అందరికీ భయంగానే ఉంది. అందుకే మాకో అడ్డా చూయిస్తే బాగుంటుంది.

– అంజనేయులు, దినసరి కూలి, మరికల్, తిమ్మాజీపేట మండలం

సమస్యలను కలెక్టర్‌కు విన్నవించాం..



భవన నిర్మాణ కార్మికుల సమస్యలను మా యూనియన్ ద్వారా ప్రజావాణిలో కలెక్టర్‌కు తెలియజేశాం. రోడ్డుపైనే అడ్డా ఉండటం వల్ల వచ్చే సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లాం. మున్సిపాలిటీలో మంచి అడ్డా చూయించి కనీస వసతులు కల్పించాలని కోరాం. అలాగే అడ్డాపైన ఉండే కూలీలకు బీమా వర్తింపజేయాలని లేబర్ అధికారులకు విన్నవించాం. అడ్డా కార్మికుల యూనియన్ ఏర్పాటు చేసుకున్నాం. యూనియన్ ద్వారా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాం.

– సుంకపాటి నర్సింహులు, అడ్డా కార్మికుల యూనియన్ అధ్యక్షుడు

షెడ్ ఏర్పాటు చేయాలి..



గ్రామాల నుంచి వచ్చే కూలీలకు (కార్మికులు) మున్సిపాలిటీ ఆధ్వర్యంలో అడ్డా చూయించి అన్ని వసతులు కల్పించాలి. కూర్చోటానికి కుర్చీలు, తాగునీరు, ఎండ, వాన నుంచి రక్షించేందుకు షెడ్ ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా రూ.5కే భోజన వసతిని అడ్డా వద్ద ప్రారంభించాలి. అలా అయితే కూలీలు ఉదయమే ఎలాంటి ఇబ్బందిలేకుండా పనులకు వెళ్లగలుగుతారు. ఇదే విషయమై మున్సిపాలిటీలో వినతిపత్రం సమర్పించాము.

– కృష్ణయాదవ్, బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు

చాలా ఇబ్బందిగా ఉంది..



పనికోసం ఉదయం వచ్చి రోడ్డుపైనే పడిగాపులు గాయాల్సి వస్తుంది. తాగడానికి నీళ్లుండవు. కూర్చుందామంటే కుర్చీలుండవు. రోడ్డుపై బండ్లు వచ్చి పోతుంటే ఎక్కడ తగులుతాయోననే భయం వెంటాడుతుంది. ఇక ఎండకు, వానకు, చలికి కష్టాలు తప్పవు. అధికారులు స్పందించి మాకో అడ్డా కల్పించి కనీస సౌకర్యాలు కల్పిస్తే బాగుంటుంది.

– మంజుల, దినసరి కూలి కార్మికురాలు, బూర్గుపల్లి, జడ్చర్ల మండలం


వెంచర్లలో గుమికూడిన టీడీపీ నాయకులు

టీడీపీ నేతల వీరంగం

పులివెందుల నియోజకవర్గంలో వెంచర్‌ను దున్నేసిన బీటెక్ రవి, అయన అనుచరులు


టీడీపీ నేతలు దున్నిన వెంచర్

చక్రాయపేట: వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం సురభి గ్రామం నాగలగుట్టపల్లె సినిమా హాల్ సమీపంలో కొందరు వ్యాపారులు వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్‌ను టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, అయన అనుచరులు ఆదివారం ట్రాక్టర్లతో దున్నేశారు. బీటెక్ రవి, సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు కలిసి వెంచర్ వద్దకు వచ్చి మారణాయుధాలు పట్టుకుని కేకలు వేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సురభి గ్రామం నాగలగుట్టపల్లె సినిమా హాల్ సమీపంలో గోవిందు రామయ్య అనే వ్యక్తికి చెందిన 1.05 ఎకరాల భూమిని రమణ, సుబ్బయ్య అనే వ్యాపారులు కొను గోలు చేసి రెండు రోజుల కిందట వెంచర్ వేశా రు. దీంతో స్థానిక టీడీపీ నేతలు తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి, రామాంజులరెడ్డిలు బీటెక్ రవిని పిలిపించుకుని వెంచర్‌ను ట్రాక్టర్‌తో దున్నేశారు. ఈ సందర్భంగా సుమారు రెండు వందల మంది టీడీపీ కార్యకర్తలు మారణా యుధాలతో బీభత్సం సృష్టించారు. ఈ విష యం తెలుసుకున్న రామయ్య, రమణ, సుబ్బ య్య వెంచర్ వద్దకు వచ్చేసరికి అందరూ వెళ్లిపోయారు. దీంతో వారు చక్రాయపేట పో లీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్కే వ్యాలీ, వేంపల్లె, పులివెందుల రూరల్, అర్బన్ సీఐలు గోవిందరెడ్డి, వెంకటేశ్వర్లు, బాలమద్దిలేటి, రాజు, చక్రాయపేట ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ అమలులో..

ఏపీదే అగ్రస్థానం

దేశంలోకెల్లా ఇక్కడే ఎస్సీ కుటుంబాలకు అతిపెద్ద సాయం.. కేంద్రం కితాబు

సాక్షి, అమరావతి : ఎస్సీ ఉప ప్రణాళిక అమలుతో పాటు ఎస్సీ కుటుంబాలకు సహాయం చేయడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. దేశంలోని మరే ఇతర రాష్ట్రం అమలుచేయని విధంగా ఎస్సీ ఉప ప్రణాళికను గత ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ఏపీ అమలుచేసినట్లు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాలు అమలు మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడించింది. 2022–23 మూడో త్రైమాసికం వరకు (అంటే ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు) దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వివిధ పథకాల అమలు పురోగతిపై నివేదికను ఆ శాఖ శనివారం విడుదల చేసింది. ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా ఆ కుటుంబాలకు సాయం అందించడం, రైతుల వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం, పట్టణ పేదలకు సాయం అందించడంలోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'చాలామంచి' పనితీరు కనబరించిందని ఆ నివేదిక కితాబిచ్చింది. లక్ష్యాల్లో 90 శాతానికి పైగా అమలుచేసిన రాష్ట్రాలను చాలామంచి పనితీరు కనబరిచినట్లు, 80–90 శాతం మేర



అమలుచేసిన రాష్ట్రాలు 'మంచి పనితీరు' కనబరిచినట్లు.. 80 శాతం లోపల అమలుచేసిన రాష్ట్రాల పనితీరు బాగోలేని రాష్ట్రాలుగా నివేదిక వర్గీకరించింది.

ఏపీలో 33.57 లక్షల కుటుంబాలకు సాయం..

ఎస్సీ ఉప ప్రణాళిక కింద దేశంలోని ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో గత ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు మొత్తం 34,68,986 ఎస్సీ కుటుంబాలకు సాయం అందించినట్లు ఆ నివేదిక పేర్కొంది. అయితే.. అందులో ఒక్క ఏపీలోనే ఏకంగా 33,57,052 కుటుంబాలకు సహాయం అందించారు. అలాగే, గతంలో కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల మంత్రిత్వ శాఖ ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు విడుదల చేసిన నివేదికలో ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా 29,10,944 కుటుంబాలకు సాయం అందించగా.. అదే ఇప్పుడు ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు విడుదల చేసిన నివేదికలో ఆ సంఖ్య 33,57,052కు పెరిగింది. అంటే.. మూడునెలల వ్యవధిలో అదనంగా 4,46,108 ఎస్సీ కుటుంబాలకు సాయం అందించింది. మిగతా మరే ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ లక్ష మంది ఎస్సీ కుటుంబాలకు కూడా సహాయం చేయలేదని నివేదిక స్పష్టంచేసింది. ఒక్క కర్ణాటకలో మాత్రమే 22,884 కుటుంబాలకు ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా సాయం అందించగా మిగతా రాష్ట్రాలు అంతకన్నా తక్కువగా వేల, వందల సంఖ్యలోనే సహాయం అందించాయి.

రాజమహేంద్రవరంలో

మరో 'మార్గదర్శి'

- టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ కుటుంబీకుల 'జగజ్జనని చిట్‌ఫండ్స్'లో భారీగా అక్రమాలు
- ఆమె మామ ఆదిరెడ్డి అప్పారావు, అతని కుమారుడు అరెస్టు
- 1982 చిట్‌ఫండ్ చట్టాన్ని ఉల్లంఘించి అక్రమాలు
- చందాదారుల సొమ్ము దారిమళ్లింపు

సాక్షి, అమరావతి/సాక్షి, రాజమహేంద్రవరం : మార్గదర్శి తరహాలో మరో భారీ మోసం వెలుగుచూసింది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జగజ్జనని చిట్స్ పేరుతో టీడీపీ నేతలు ఆర్థిక నేరానికి పాల్పడిన విషయం బట్టబయలైంది. 1982 చిట్‌ఫండ్స్ చట్టం నిబంధనలు ఉల్లంఘించి, ఇష్టానుసారం డిపాజిట్లు సేకరించి, వాటిని ఇతర వ్యాపారాలకు, వడ్డీలకు మళ్లించి అక్రమాలకు తెరతీసిన విషయం సీఐడీ దర్యాప్తులో నిర్ధారణ అయ్యింది. దీంతో ఆ చిట్‌ఫండ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు–ఏ1, డైరెక్టర్‌గా ఉన్న అయన కుమారుడు ఆదిరెడ్డి శ్రీనివాస్–ఏ2 (రాజమహేంద్రవరం సిటీ టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని భర్త)లను సీఐడీ అధికారులు రాజమహేంద్రవరంలో ఆదివారం అరెస్టుచేశారు. వీరితోపాటు మరో డైరెక్టర్ అయిన ఆదిరెడ్డి అప్పారావు కుమార్తె ఆదిరెడ్డి వెంకట జ్యోత్స్నలపై ఐపీసీ సెక్షన్లు 420, 409, 120బి, 477 (ఎ) రెడ్‌విత్ 34, రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం సెక్షన్–5, కేంద్ర చిట్‌ఫండ్ చట్టం–1982 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జగజ్జనని చిట్‌ఫండ్స్ అక్రమాలకు పాల్పడుతున్నట్టు సీఐడీ విభాగానికి కొన్నినెలల క్రితమే ఫిర్యాదులొచ్చాయి. అక్రమాలు వాస్తవమేనని నిర్ధారణ కావడంతో చిట్ రిజిస్ట్రార్ ఈ విషయంపై సీఐడీకి ఫిర్యాదు చేశారు. దాంతో సీఐడీ అధికారులు ఈ ఏడాది మార్చిలో జగజ్జనని


సీఐడీ కార్యాలయం వద్ద టీడీపీ ఎమ్మెల్యే భవానీ

చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆ తనిఖీల్లో భారీగా ఆర్థిక అక్రమాలు వెలుగుచూశాయి. వీటిపై సంస్థ బ్రాంచి మేనేజర్లు (ఫోర్‌మెన్) సరైన వివరణ కూడా ఇవ్వలేకపోవడంతో సీఐడీ అధికారులు కేసును మరింత లోతుగా విచారించి అవకతవకలను నిర్ధారించారు.

యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలు..

జగజ్జనని చిట్ ఫండ్స్ కంపెనీ కొన్నేళ్లుగా ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు సీఐడీ తనిఖీల్లో బట్టబయలైంది. ఆ కంపెనీ ఎండీ, డైరెక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా చందాదారుల సొమ్మును మళ్లించి సొంత ఆస్తులు భారీగా కూడబెట్టుకున్నట్లుగా ఆధారాలను గుర్తించారు.

- చిట్‌ఫండ్స్ కంపెనీలు ఇతర వ్యాపారాలు చేయడం చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధం. కానీ, జగజ్జనని సంస్థ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్ల సేకరణ, అక్రమంగా రుణాలు మంజూరు చేస్తూ వడ్డీ వ్యాపారం నిర్వహిస్తోంది. 2018 నుంచి 2023 వరకు భారీగా అక్రమ డిపాజిట్లు వసూలు చేసినట్లు.. వాటిపై వడ్డీలు చెల్లించినట్లు గణాంకాలతో సహా వెల్లడైంది. అదే రీతిలో చందాదారుల సొమ్ముతో భారీగా వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. తద్వారా భారీ ఆదాయాన్ని ఆర్జించినట్లు వెల్లడైంది.
- చిట్టీల వేలం సొమ్ము చెల్లింపు ముసుగులో జగజ్జనని చిట్‌ఫండ్స్ నల్లధనాన్ని చెలామణిలోకి తెస్తోంది. 49 చిట్టీ పాటల ప్రైజ్‌మనీ మొత్తం రూ.11,76,82,000 చెల్లింపులను పరిశీలించారు. వాటిలో 21 చిట్టీ పాటల ప్రైజ్‌మనీ రూ.4,68,45,753ను బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. మిగిలిన 28 చిట్టీల వేలం పాటల ప్రైజ్‌మనీ రూ.7,08,36,247ను నగదు రూపంలో చెల్లించినట్లు చెప్పారు. నగదు రూపంలో చెల్లించడం నిబంధనలకు విరుద్ధం. అంటే.. నల్లధనాన్ని చెలామణిలోకి తెచ్చినట్లు వెల్లడైంది.
- చిట్‌ఫండ్ కంపెనీ అన్ని వ్యవహారాలు నగదులోనే నిర్వహిస్తోంది. అంటే చందాల వసూళ్లు, చిట్ పాట మొత్తం చెల్లింపులన్నీ నగదులోనే నిర్వహిస్తోంది. ఇది ఆదాయపన్ను చట్టానికి విరుద్ధం. బ్యాంకు ఖాతాల్లో సంస్థ భారీగా నగదు డిపాజిట్లు కూడా చేస్తోంది. చిట్ వసూళ్లతో ఆ డిపాజిట్లు సరిపోలడంలేదు. ఎక్కువగా బ్యాంకు డిపాజిట్లు నగదు రూపంలోనే చేస్తున్నారు. చందా చెల్లించడంలేదని చెబుతున్న చిట్‌ల కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా నిర్వహించడంలేదు.

బాధితులు 22 వేల మంది..

కొల్లగొట్టింది రూ. 10 కోట్లు

వెలుగులోకి వస్తున్న చక్రధర్ మోసాలు


నిందితుడు చక్రధర్

సాక్షి, సిటీబ్యూరో: చిన్న మొత్తాలను ఎక్కువ మంది నుంచి సేకరించడం వల్ల ఎవరికీ దొరకకుండా తప్పించుకోవచ్చనే ఉద్దేశంతో పథకం ప్రకారం మోసానికి పాల్పడిన సిద్దిపేటకు ఓ రాజకీయ పార్టీ నాయకుడు గడగోని చక్రధర్ వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. సుమారు 22 వేల మందిని మోసం చేసి రూ.10 కోట్ల వరకు వసూలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

కాల్ సెంటర్ ఏర్పాటుతో..

- కాల్ సెంటర్ ఏర్పాటు చేసి వివిధ రాష్ట్రాలకు చెందిన టెలీకాలర్స్ ద్వారా డాటా ఎంట్రీ జాబ్ అంటూ దక్షిణాది రాష్ట్రాల్లోని అమాయకులకు ఫోన్లు చేసి, డాటా ఎంట్రీ ప్రాజెక్ట్ ఇస్తామంటూ నమ్మించి డాటా ఎంట్రీ వర్క్‌తో నెలకు రూ. 20 వేల నుంచి రూ. 25 వేలు సులభంగా సంపాదించుకోవచ్చంటూ బాధితులకు వల వేసేవాడు. ఒప్పుకొన్న వారికి ఇంటర్నెట్ నుంచి సేకరించిన ఇమేజ్‌లను పంపించి డాక్యుమెంట్‌గా కన్వర్ట్ చేయాలంటూ టార్గెట్ ఇచ్చేవాడు. పని పూర్తి చేసి పంపిన వాళ్లకు అడ్వాన్స్‌గా 10 శాతం చెల్లిస్తే, క్వాలిటీ చెక్ చేసి మీ బిల్లులు చెల్లిస్తామంటూ ముందుగా 10 శాతం, ఆ తర్వాత కొన్ని పొరపాట్లున్నాయని వాటిని సెట్ చేయాలని అందుకు మరో 10 శాతం చెల్లించాలంటూ మొత్తం 20 శాతం వసూలు చేసేవాడు.
- ఇలా డబ్బులు వసూలు చేసి, వాళ్ల టార్గెట్ 30 నుంచి 45 రోజులు కాగానే ఆ బ్యాచ్‌ను క్లోజ్ చేసేవాడు. ఒక బ్యాచ్‌లో సుమారు 2 వేల మందిని మోసం చేసేవాడు. ఆ బ్యాచ్‌కు వాడిన సిమ్ కార్డులు, వాళ్లకు ఇచ్చిన డాటా ఎంట్రీ ఇమేజ్‌లను మొత్తం ధ్వంసం చేసేవాడు. ఆ తర్వాత కొన్నాళ్లు విరామం ఇచ్చి తిరిగి మరో బ్యాచ్‌ను ప్రారంభించేవాడు. బాధితులు మోసం జరిగిందని తెలుసుకొని ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చేది. పోయింది రూ. 5 వేలే కదా అనే ఉద్దేశంతో అంతటితో చాలా మంది వదిలేసేవారు. ఈ క్రమంలో ఇటీవల ఇద్దరు బాధితులు తమకు జరిగిన డాటా ఎంట్రీ మోసాలపై ఫిర్యాదు చేశారు. నగర సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో భారీ మోసం వెలుగులోకి వచ్చింది.

2018లో స్కెచ్..

చక్రధర్ పలు బ్యాంకుల్లో ఏజెంట్‌గా పని చేస్తూ తన బావమరిదితో కలిసి రియల్ ఎస్టేట్ చేసేవాడు. 2018లో అమీర్‌పేటలో ఉన్న తన బంధువు వినోద్‌తో కలిసి కాల్‌సెంటర్ వద్దకు వెళ్లాడు. అక్కడ డాటా ఎంట్రీ అంటూ ఫోన్లు చేస్తున్న విషయాన్ని గుర్తించి.. తానూ ఇలాగే ఓ కాల్‌సెంటర్ ఏర్పాటు చేసి మోసాలు చేయాలని అతని బంధువుతో ఆలోచన చేశాడు. దీంతో 2018లోనే అమీర్‌పేట్‌లో ఒక కాల్‌సెంటర్ ఏర్పాటు చేశారు. 2021లో తన అడ్డాను పంజాగుట్టకు మార్చాడు.

11 బ్యాచ్‌లు..

అనంతపురం నుంచి రూ.వెయ్యికి ఒక సిమ్ కార్డు కొనడం, నిరుద్యోగుల డాటాను వివిధ మార్గాలలో సేకరించి టెలీ కాలర్స్‌కు అప్పగించే వాడు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళం, మలయాళం, కన్నడం తెలిసిన వారిని కాల్‌సెంటర్ ఉద్యోగులుగా నియమించుకున్నాడు. వీళ్లకు నెలకు రూ. 15 వేల జీతం, ఉచిత భోజనం, వసతి కల్పిస్తూ, మోసాలు ఎక్కువగా చేసేవారికి ఎక్కువగా ఇన్సెంటివ్‌లు ఇచ్చేవాడు. కేవలం రూ. 2500 నుంచి రూ. 5000 వరకు వారి అమాయకత్వం బట్టి మోసం చేసేవాడు. ఇలా 2021 నుంచి 11 దఫాలుగా సుమారు 22 వేల మందిని చక్రధర్ మోసం చేసి రూ. 10 కోట్ల వరకు వసూలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ డబ్బుతో బాచుపల్లి ప్రాంతంలో ప్లాట్లు, హైఎండ్ కార్లు కొనుగోలు చేశాడు. దీంతో పాటు సామాజిక సేవ చేస్తున్నట్లుగా రైతులకు, ఇతరులకు చెక్కులు ఇచ్చి ప్రచారం చేసుకునేవాడు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే పోలీస్ కేసులా?

మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి విమర్శించారు. గ్రామాల్లో బీఆర్ఎస్ మూకలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ నయిం అనుచరులను తలపిస్తున్నారని దుయ్యబట్టారు. పోలీసులు సైతం తప్పు చేసినవాళ్లను వదిలిపెట్టి, తప్పు చేయనివాళ్లపై అక్రమ కేసులు పెట్టి హింసిస్తున్నారని ఆరోపించారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేను సోషల్ మీడియాలో విమర్శించారన్న కారణంతో బిజినేపల్లి పోలీసులు ఇద్దరు యువకులపై కేసులు పెట్టడాన్ని అయన తప్పుబట్టారు. ఎవరైనా తప్పు చేస్తే విమర్శించరా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు చేస్తే కేసులు నమోదు చేస్తామంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేయడమేంటని నిలదీశారు. ప్రజలకు హెచ్చరికలు జారీ చేసే అత్యున్నత అధికారం వారికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. పోలీసులు అధికార పార్టీ నేతల మెప్పు పొందేందుకే ఆరాటపడుతున్నారని ఆరోపించారు. నాగర్‌కర్నూల్‌లో నల్లమట్టి, ఇసుక, భూకబ్జాలపై విచారణ చేపట్టాలని సీఎం కేసీఆర్‌కు లేఖ రాస్తున్నట్లు చెప్పారు. అకాల వర్షాలకు పంటనష్టపోయిన రైతులకు పరిహారం ఏమైందని ప్రశ్నించారు. వ్యవసాయ సబ్సిడీలు, పరికరాలు, పంట బీమా పత్తాలేదని విమర్శించారు. ప్రభుత్వం రైతుబంధు కింద ఇస్తున్న రూ. పదివేలు దేనికి చాలడం లేదన్నారు. దళిత బంధు కింద ఎమ్మెల్యేలు రూ.3 లక్షల చొప్పున తీసుకుంటున్నారని తెలిసినా సీఎం కేసీఆర్ వారిని క్షమిస్తున్న ఉదార గుణానికి ఆశ్చర్యం కలుగుతోందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో అర్థం రవి, బాలాగౌడ్, నారాయణగౌడ్, పాండు, సత్యం పాల్గొన్నారు.

ఏకశిలా రూపుడు లోకిరేవు వీరభద్రుడు


నవాబుపేట లోకిరేవు వీరభద్ర స్వామి ఆలయం

- నేటి నుంచి వీరభద్రస్వామి ఉత్సవాలు

నవాబుపేట: ఏకశిలతో ఏర్పాటు చేసిన వీరభద్రుడి నిలువెత్తు స్వరూపం లోకిరేవు వీరభద్రుడి ప్రత్యేకత. దాదాపు ఏళ్లక్రితం వాగు ఒడ్డుపై స్వయంభుగా వెలసిన భద్రకాళి సమేత వీరభద్రుడు ఇక్కడి ప్రజల ఇంటి దేవుడిగా పేరుగాంచి నిత్యం పూజలు అందుకుంటున్నాడు. మండల పరిధిలోని లోకిరేవు వీరభద్రస్వామి ఆలయం చాలా పురాతనమైనదిగా ప్రసిద్ధి చెందిన ఆలయం. కాగా ఎక్కడ చూసినా వీరభద్ర విగ్రహం చాలా చిన్నగా ఉంటుంది. కానీ లోకిరేవు ఆలయంలో మాత్రం ఐదున్నర అడుగుల విగ్రహం ఏకశిలతో ఉండటం విశేషం. కాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి తమ ఇలవేల్పుగా భావించి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ప్రతి ఏటా మే నెలలో ఉత్సవాలు జరుగుతుంటాయి.

నేటి నుంచి ఉత్సవాలు..

మండల పరిధిలోని లోకిరేవు గ్రామంలో వెలసిన వీరభద్ర స్వామి ఉత్సవాలు ఈనెల మే 1వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నట్లు పూజారులు లింగయ్య, నందీశ్వర్ తెలిపారు. కాగా సోమవారం నందికోల సేవ, తెల్లవారుజామున ఉదయం 4.55లకు గురువారం అగ్నిగుండం, సాయంత్రం శకటోత్సవం, పార్వతీ పరమేశ్వర కల్యాణం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పూజారులు తెలిపారు. అనంతరం 2న ప్రత్యేక అలంకరణ, 3న మహా మంగళహారతితో ఉత్సవాలు ముగుస్తాయని పూజారులు వివరించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శాంతినిచ్చే ఏకైక దేశం మనదే..


భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న పరిపూర్ణానందస్వామి

- కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతులు పరిపూర్ణానంద స్వామి
- ముగిసిన సీతారామ ఆంజనేయ ఆశ్రమ స్వర్ణోత్సవాలు

భూత్పూర్: ప్రపంచంలో శాంతినే ఇచ్చే ఏకైక దేశం మనదే అని కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతులు పరిపూర్ణానంద స్వామి అన్నారు. ఆదివారం మండలంలోని పోతులమడుగు పంచాయతీలోని ముత్యాలంపల్లిలో 4 రోజులపాటు సీతారామ ఆంజనేయ స్వామి ఆశ్రమ స్వర్ణోత్సవాలు ఆశ్రమ పీఠాధిపతులు తిరుపతి తీర్థానంద స్వాములు, ఆశ్రమ బ్రహ్మచారి వెంకట్‌చరణ్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం, చండీయాగ కార్యక్రమంలో స్వామి ముఖ్య అతిథులుగా హాజరై భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. మహత్తరమైన శక్తి వ్యక్తిలో దాగి ఉందని, వ్యక్తి సాధన, విధి విధానాలు, పద్ధతుల ద్వారా ఆశక్తిని మేల్కొపాలని అన్నారు. గంగానది భారతదేశంతో పాటు మక్కా, జర్మనీ, మెక్సికో, బ్రెజిల్ దేశాల్లో 40 శాతం కంటే తక్కువగా ఔషధ గుణాలున్నాయని, భారతదేశంలోని కేదరినాథ్ సమీపంలో ప్రవహించే గంగానది వంద శాతం ఔషధ గుణాలున్నాయన్నారు. అనంతరం బ్రహ్మచారి వెంకట్ చరణ్ చేపడుతున్న కార్యక్రమాలను పరిపూర్ణానంద స్వామి అభినందించారు. అనంతరం ఆయనను శాలువా, పూలదండలతో సత్కరించారు. కార్యక్రమంలో కాశీ క్షేత్రం పీఠాధిపతులు పరమత్మానందగిరి స్వామి, మహేంద్రశివాచార్యులు, తిరుపతి తీర్థానంద స్వామి, మహేంద్ర శివాచార్యులు, ఆచార్య గౌరయ్య స్వామి, జానకీరాములు, ముక్తేశ్వరానంద స్వామి, భక్తులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై కేంద్రం దాడులు ఆపాలి

అచ్చంపేట: కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలపై చేస్తున్న వైమానిక దాడులు వెంటనే ఆపాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని టీఎస్‌జీఓ భవనంలో జరిగిన ఆదివాసీలపై వైమానిక దాడులకు వ్యతిరేకంగా నిర్వహించిన బహిరంగ సభలో అయన మాట్లాడారు. రాజ్యాంగం విధ్వంసానికి గురవుతుందని, మనమంతా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మోదీ ప్రభుత్వంలో రాజ్యాంగ విలువలు మంటగలిపాయని విమర్శించారు. ప్రభుత్వాలు చేస్తున్న దోపిడీని ఖండించే మేధావులపై నిర్బంధం మోపుతున్నారని, వనరుల దోపిడీ కోసమే వైమానిక దాడులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని అన్నారు. పేదల హక్కుల కోసం మాట్లాడితే అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్, ఒడిశాలోని ఆదివాసీల వనరుల దోపిడీని అడ్డుకోవాలన్నారు. విధ్వంసకరమైన అభివృద్ధిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లోని 28 రకాల ఖనిజ సంపదను అదాని, అంబానీలకు కట్టబెట్టేందుకు లక్షల మంది సైన్యాన్ని మోహరించారని అన్నారు. మావోయిస్టుల పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ జైళ్లో మగ్గేలా కేసులు చేస్తూ నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు, నాయకులు జావెద్, తిరుమలయ్య, జక్కు బాలయ్య, లక్ష్మీనారాయణ, వెంకటేష్, రఘునందన్, సత్యం, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మణ్

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అకాల వర్షాలు కురవడంతో రైతులు, వ్యవసాయ కూలీలు వరికోతలో, తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో ఉన్నారు. జాతరకు ఈ ఆదివారం కేవలం 3వేలమంది భక్తులు హాజరై దర్శించుకున్నారు. భక్తులు లేక జాతరలోని గుడారాలు వెలవెలబోయాయి.



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు


మంచాలకట్ట శివారులోని కృష్ణానదిలో సాగుచేస్తున్న పొద్దుతిరుగుడు పంట

కృష్ణానదిలో.. తీరొక్క పంటలు

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాక కృష్ణానదిలో ముంపునకు గురైన సారవంతమైన నేలల్లో స్థానికులు తీరొక్క పంటలు పండిస్తూ లాభాలు గడిస్తున్నారు. ప్రతి సంవత్సరం కృష్ణానదికి నీరు జూన్‌లో వచ్చి కొన్ని నెలలు నిండుకుండలా ప్రవహించి మళ్లీ జనవరి, ఫిబ్రవరి వరకు ఎండిపోతుంది. ఈ సమయంలో తీరగ్రామాలైన కొప్పునూరు, జటప్రోల్, చెల్లెపాడు, మాధవస్వామినగర్, మంచాలకట్ట, మల్లేశ్వరం, సోమశిల, వేంకల్, అమరగిరి గ్రామాల ప్రజలు నదిలో తేలిన భూమిలో పంటలు పండిస్తారు. ముఖ్యంగా పుచ్చకాయ, వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడ, మినుములు, మొక్కజొన్న, గోంగూర, శనగలు వంటి పంటలను సాగుచేసి అధిక దిగుబడులను పొందుతుంటారు. ఈ భూములకు కనీస నీటి సదుపాయం లేకపోయినా పంటలు పండుతాయి.

\- పెంట్లవెల్లి


జటప్రోల్‌లో కృష్ణానదిలో సాగుచేస్తున్న మినుము పంట

మల్లేశ్వరంలో కోసి కట్టలు కట్టిన నువ్వుల పంట

జటప్రోల్ సమీపంలో కృష్ణానదిలో కొత్తగా పుచ్చకాయ పంట సాగు